## క్లుప్తంగా

### కేటీఆర్‌ను కలిసిన గుత్తా



కేటీఆర్‌కు దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను బుధవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కేటీఆర్‌కు జమ్మి ఆకు అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

### ముగిసిన క్రికెట్ పోటీలు

**నకిరేకల్ :** మున్సిపాలిటీలోని మినీ స్టేడియంలో వారం రోజులపాటు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 38 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి నకిరేకల్ క్రికెట్ క్లబ్, రెండో బహుమతి తాటికల్, మూడో బహుమతి కట్టంగూరు, నాలుగో బహుమతి వాసవీనగర్‌లు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, గడ్డం స్వామి, రాచకొండ సునీల్, చౌగోని రాములమ్మ సైదులు, రైతు బంధు సమన్వయ సమితి అధ్యక్షులు సామ శ్రీనివాస్‌రెడ్డి, క్రీడల నిర్వహణ అధ్యక్షుడు ఆదిల్ పాల్గొన్నారు.

### అసత్య ప్రకటనలు మానుకోవాలి

**నల్లగొండ టౌన్ :** పట్టణంలోని 14వ వార్డు నుంచి సీపీఎం నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు చేస్తున్న అసత్య ప్రకటనలు మానుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎండీ. సలీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం 14వ వార్డు నుంచి సీపీఎం నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు కొందరు ప్రచారం చేశారని, అందులో నిజం లేదన్నారు.

### స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న స్నేహితులు

**శాలిగౌరారం :** అనారోగ్యానికి గురై ఇటీవల మృతిచెందిన మండలంలోని మనిమద్దె గ్రామానికి చెందిన ఇటికాల అశోక్ కుటుంబానికి 2009 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన స్నేహితులు బుధవారం రూ. 10వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో గేదె మృతి

**శాలిగౌరారం :** తెగిపడిన విద్యుత్ తీగ తగలడంతో మేత మేసుకుంటూ వెళ్లిన గేదె అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని ఎన్‌జి కొత్తపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వివరాలు.. ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన చిప్పలపల్లి ఐలయ్య రోజువారి మాదిరిగానే తన గేదెలను గ్రామ సమీపంలోని బీడు భూమిలో మేపుతుండగా అప్పటికే అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ తీగ గేదెకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.60 వేలకు పైగా ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

### అనాథాశ్రమంలో అన్నదానం

**నల్లగొండ రూరల్ :** డీటీసీ ఎస్ఐ డి.క్రాంతికుమార్ పుట్టినరోజు సందర్భంగా అనుముల మండల యూత్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలోని మదర్ థెరిస్సా అనాథాశ్రమంలో వృద్ధులకు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతల నాగరాజు, గంగుల శివ, రామలింగం, అశోక్, సైదులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో దోరెపల్లి వాసి మృతి

**కనగల్ :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్ర జరిగిన రోడ్డు ప్రమాదంలో దోరెపల్లి గ్రామానికి చెందిన బక్క చిన్న నర్సింహ(40) మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దోరెపల్లి గ్రామానికి చెందిన బక్క లక్ష్మయ్య–ఎల్లమ్మ మొదటి కుమారుడు నర్సింహ నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. వృత్తిరీత్యా విజయవాడలో ఐస్‌క్రీం కంపెనీలో మాస్టర్‌గా పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు వెళ్తూ ఉంటాడు. ఈ క్రమంలోనే మహబూబ్‌నగర్‌కు వెళ్లగా అక్కడ ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నర్సింహ అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింహ మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు. నర్సింహకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

### త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం

**చండూరు :** రైతు సేవా సహకార సంఘం చండూరు ఆధ్వర్యంలో అంగడిపేట ఎస్సీ కాలనీ సమీపంలో త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని సంఘం చైర్‌పర్సన్ కోడి సుష్మ వెంకన్న అన్నారు. బుధవారం జరిగిన రైతు సేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. కస్తాల, తేరట్‌పల్లి గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు.

# అసౌకర్యాల నడుమ ఫైర్ స్టేషన్

- సొంత భవనం లేక సిబ్బంది అవస్థలు
- ఇప్పటికి రెండుమార్లు నిధులు మంజూరు
- నిర్మాణానికి స్థలం లేకపోవడంతో నిధులు వెనక్కి



నకిరేకల్‌లోని అగ్నిమాపక కేంద్రం

**నకిరేకల్ :** నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. 20 ఏళ్ల నుంచి తాత్కాలిక షెడ్డులోనే ఈ కేంద్రం కొనసాగుతోంది. ఈ కేంద్రం పరిధిలో నకిరేకల్, శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి మండలాలు ఉన్నాయి. 2003 జనవరి మాసంలో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌లోని రైతు విశ్రాంతి భవనంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. విశ్రాంతి భవనం పక్కనే ఫైరింజన్ కోసం తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారు. సొంత భవనం నిర్మించకపోవడంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల నాలుగు మండలాల్లో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా క్షణాల్లో మేమున్నామంటూ వెళ్లే అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి వసతులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మాటిమాటికి మార్కెట్ సిబ్బంది హెచ్చరికలతో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది దిగాలు చెందుతున్నారు.

**నిధులు మంజూరైనా..**

నకిరేకల్‌లో అగ్నిమాపక కేంద్రానికి పక్కా భవనం కోసం 2013 వ సంవత్సరంలో ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు కాగా స్థలం లేకపోవడంతో భవనాన్ని నిర్మించలేదు. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. 2014లో కూడా రూ.45 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులకు కూడా అదే పరిస్థితి ఎదురైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గతంలో 400 గజాల స్థలాన్ని ఫైర్ స్టేషన్ భవన నిర్మాణం కోసం కేటాయించినా నేటికీ భవన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరైనా అవి సకాలంలో వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోయాయి.

**ఫైర్ స్టేషన్ ఎదుట ధాన్యం రాశుల నిల్వలు**

నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో రైతు విశ్రాంతి భవనాన్ని తాత్కలికంగా ఫైర్ స్టేషన్‌కు కేటాయించారు. ప్రతి సీజన్‌లో వరి ధాన్యాన్ని రైతులు మార్కెట్‌లో విక్రయించేందుకు తీసుకువస్తారు. ఫైర్ స్టేషన్ ఎదుట కూడా ధాన్యం రాశులు నిల్వలు ఉండడంతో అత్యవసర సమయంలో ఫైర్ ఇంజన్ బయటకు వెళ్లాలంటే ధాన్యం రాశులు మీదుగా వెళ్లక తప్పడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి నకిరేకల్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సొంత భవనం నిర్మించేవిధంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

**సొంత భవనం నిర్మించాలి**



నకిరేకల్‌లోని అగ్నిమాపక కేంద్రంలో సౌకర్యాలు అంతంత మాత్రమే. సొంత భవనం కోసం స్థలం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరవుతున్న నిధులు వెనక్కి మళ్లిపోతున్నాయి. 20 ఏళ్ల నుంచి తాత్కాలిక షెడ్డులోనే ఫైరింజన్ పెట్టి విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. సొంత భవనం కోసం స్థలం కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలి.

–భీముడు, అగ్నిమాపక కేంద్రం అధికారి, నకిరేకల్

### కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

**రామగిరి(నల్లగొండ):** తిప్పర్తి మండలంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకురి రమేష్, యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్ ఆధ్వర్యంలో తిప్పర్తి, మామిడాల గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా ముత్యాలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ నాగమణి అంబేద్కర్, దొంతినేని నాగేశ్వరరావు, వనపర్తి శ్రీరాములు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి**

**కనగల్ :** రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బోయినపల్లి మత్స్యశాఖ సెక్రెటరీ పర్సనబోయిన సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనగల్ మండలం నుంచి కోమటిరెడ్డికి భారీ మెజార్టీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ సోషల్ మీడియా కనగల్ మండల అధ్యక్షుడు పోలే విజయ కుమార్, ఓబీసీ వైస్ ప్రెసిడెంట్ గోని నరేష్, సాయి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో పలువురి చేరిక

**రామగిరి(నల్లగొండ):** తిప్పర్తి మండలంలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో వార్డు మెంబర్ నకిరేకంటి మహేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినయ్, గంగాధర్, మల్లయ్య, నాగేంద్రబాబు, యాదయ్య, మహేష్, అనిల్, భిక్షం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### హెలీపాడ్ స్థలం పరిశీలన



సీఎం సభ స్థలం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్, ఎస్పీ

**మునుగోడు :** ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మునుగోడులో సీఎం కేసీఆర్ సభ నేపథ్యంలో సభ, హెలీపాడ్ స్థలాలను కలెక్టర్, ఎస్పీ బుధవారం పరిశీలించారు. సభ స్థలం వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసినందున సంబంధిత రైతుల అనుమతి ఉందా లేదా అని రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలీపాడ్ వద్ద అగ్నిమాక, భద్రత సిబ్బందిని నియమించడంతోపాటు ప్రత్యేక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు సిద్ధం చేయాలన్నారు. వారి వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి దామోదర్, జిల్లా అగ్నిమాపక అధికారి పి.షణ్ముఖరావు, నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ నరేందర్, స్థానిక పోలీసులు ఉన్నారు.

### మునుగోడు టికెట్ సీపీఐకే కేటాయించాలి

**మునుగోడు :** అసెంబ్లీ ఎన్నికల పొత్తులో భాగంగా సీపీఐకి మునుగోడు స్థానాన్ని కేటాయించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం అన్నారు. గురువారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవేళ సీటు కేటాయించకపోతే సీపీఐ సొంతంగా పోటీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, నాయకులు బొల్గూరి నర్సింహ, బి.లాలు, ఈ. కైలాస్, బి. యాదయ్య, పాండు, మాదగోని సత్తమ్మ, వనం వెంకన్న, దుబ్బ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న గుర్జ రామచంద్రం

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా వలసలు



తిప్పర్తి మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి



నల్లగొండ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

**నల్లగొండ :** నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే నల్లగొండ పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా బుధవారం తిప్పర్తి మండలానికి చెందిన జెడ్పీటీసీ పాశం రాంరెడ్డితోపాటు ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మి లింగారావు, రైతు బంధు మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాంతోపాటు పది గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ తాను నల్లగొండకు వస్తే స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నాడని, ఎక్కువగా నియోజకవర్గానికి రాలేకపోయానని తెలిపారు. ప్రజలంతా కాంగ్రెస్‌వైపే ఉన్నారని వేనేపల్లి చందర్‌రావు లాంటి వాళ్లే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ 30 రోజులు కష్టపడి తనను గెలిపించినట్లయితే ప్రజల కోసం 5 సంవత్సరాలు కష్టపడి పని చేస్తానని చెప్పారు.

**పార్టీలో చేరిన వారు..**

తిప్పర్తి జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మిలింగారావు, రైతు బంధు మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాం, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, చిలుక శ్రీనివాసరెడ్డి, ఉయ్యాల నాగరాజు, నలపరాజు శ్రీనివాస్, మెరుగు వెంకన్న, ఎండీ. బాబర్, వంశీ, సర్పంచ్‌లు రొట్టెల రమేష్, ప్రవీణ్‌కుమార్, వెంకటరాంరెడ్డి, మర్రి యాదయ్య, అసంబీ, సుశీల, శ్రీదేవి, సతీష్, తూనెం రవి, ఎంపీటీసీ సిరివెన్నెల కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**గుమ్ముల మోహన్‌రెడ్డి సమక్షంలో..**

నల్లగొండ పట్టణం 3వ వార్డు శేషమ్మగూడెంకు చెందిన 20 మంది బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు బుధవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కొప్పు శ్రీనుగౌడ్, కొప్పు చంద్రయ్యగౌడ్, దూడ లింగయ్య, గాదరి సైదులు, గాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**కోమటిరెడ్డి సమక్షంలో..**

**కనగల్ :** మండల పరిధిలోని శేరి లింగోటం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సింగ్ సైదులుతోపాటు 30 కుటుంబాలు బుధవారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ పోషమళ్ల వెంకన్న, మేరెడ్డి నరేందర్‌రెడ్డి, మండలి శంకర్, చింతపల్లి వెంకన్న, వడ్డేపల్లి భిక్షం, ప్రసాద్, విజయ్, శంకర్‌రెడ్డి, శంకర్, నాగరాజు, పరమేష్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలి


- నకిరేకల్ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం



చిన్నకాపర్తిలో మాట్లాడుతున్న వేముల వీరేశం

**చిట్యాల :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలంతా మద్దతు ఇచ్చి ఎన్నికల్లో విజయాన్ని అందించాలని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం కోరారు. చిట్యాల మండలం ఆరెగూడెం, చిన్నకాపర్తి, బోయగుబ్బ గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఓటు వేయాలని గ్రామస్తులను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా పెద్దకాపర్తి, మాజీ ఎంపీటీసీ పిశాటి మాధవరెడ్డి, చిన్నకాపర్తి మాజీ సర్పంచ్ వలిగొండ లింగమ్మ సోమయ్య, ఉప సర్పంచ్ ఆవుల రమేష్, గుండ్రాంపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌లతోపాటు మరో వందమందికిపైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, నాయకులు కంచర్ల వెంకట్‌రెడ్డి, గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఆవుల యాదయ్య, పొట్లపల్లి రవి, బోయపల్లి వెంకన్నగౌడ్, నాగంపల్లి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కనగల్ : శాబ్దుల్లాపురం గ్రామంలో ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం నరహరి

**కనగల్ :** మండలంలోని దోరెపల్లి, శాబ్దుల్లాపురం, రేగట్టె గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం బత్తుల నరహరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ విజయకుమారి, వీబీకే లింగాల సుజాత, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

**శాలిగౌరారం :** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పాల్‌సింగ్ బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, అడ్లూరు, మాధారంకలాన్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ లక్ష్మయ్య, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, పీఏసీఎస్ చైర్మన్ తాళ్ళూరి మురళి, సీఈఓ నిమ్మల ఆంజనేయులు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

**కట్టంగూర్‌లో..**

**కట్టంగూర్ :** మండలంలోని చెర్వుఅన్నారం, గంగదేవిగూడెం గ్రామాల్లో ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ శాఖ ఏడీఏ హుస్సేన్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ, డైరెక్టర్లు ఉన్నారు.

### రైతుల ఆందోళన

**మర్రిగూడ :** శివన్నగూడ రిజర్వాయర్ నిర్మాణంలో అదనంగా 57.37 ఎకరాలు సేకరించారని ఆరోపిస్తూ మర్రిగూడ మండలంలోని కుదాబక్షపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం గ్రామంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మొదటగా 250 మీటర్లు ఉన్న కట్ట నిర్మాణాన్ని 600 మీటర్లకు పెంచారని అన్నారు. 57.37 ఎకరాలను అదనంగా సేకరించేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఉప ఎన్నికలో ఇచ్చిన హామీని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అమలు చేయలేదని, తమ భూమిని తమకు అప్పగించాలని 35 కుటుంబాలువారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తాళ్లపల్లి మారయ్య, మాదగోని సైదులు, మెగావత్ గణేశ్, బలరాం, బ్రహ్మచారి, జానయ్య, లక్ష్మయ్య, భిక్షమయ్య, సీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలే నా బలం.. అభివృద్ధే నా ధ్యేయం

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** సీఎం కేసీఆర్ నాయకత్వంలో నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని, 'ప్రజలే నా బలం, అభివృద్ధే నా ధ్యేయం'గా పని చేశానని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లగొండ పట్టణాన్ని రూ.1300 కోట్లతో అభివృద్ధి చేశానని, ఒక్కసారి గెలిస్తేనే ఇంత అభివృద్ధి చేశానని, మరోసారి గెలిపిస్తే నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుతానని అన్నారు. ఐటీ కంపెనీ, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రి పడకల పెంపు, బత్తాయి మార్కెట్ నిర్మాణం, రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జీలు నిర్మాణం, రోడ్ల విస్తరణ, సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమన్నారు. నల్లగొండ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్, వీరమల్ల భాస్కర్, మామిడి పద్మ తదితరులు పాల్గొన్నారు.

**ఎన్నికల ఖర్చుకు రూ. ఐదు వేలు అందజేత**

బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి ఎన్నికల ఖర్చు కోసం నల్లగొండ పట్టణంలోని 12వ వార్డుకు చెందిన శ్రీనివాసచారి రూ.5 వేలు అందజేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అంతకు ముందు వార్డుకు చెందిన మహిళలు మంగళహారతి పట్టి ఎమ్మెల్యే కంచర్లకు ఘన స్వాగతం పలికారు.

## అభివృద్ధికి మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరికలు

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కేతేపల్లి : బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి

**కేతేపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు మద్దతుగానే ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బుధవారం కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, మహిళలు నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మూడోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో బుద్దె గణేశ్, కోట సైదయ్య, ఎగ్గడి సత్యనారాయణ, వినోద, బుద్దె సురేష్, మధు, నవీన్, రాకేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు బొప్పని సురేష్, ఎస్.నాగేశ్వరావు, ఎం.నర్సయ్య, కోట సంపత్‌రావు, కోట రామలింగయ్య, పూర్ణచందర్‌రావు, సతీష్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలి**

**నార్కట్‌పల్లి :** శాసన సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి కోరారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు డెంకల నరేష్‌తోపాటు మరో 20 కుటుంబాలు జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అనంతరం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చిరుమర్తి లింగయ్యను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈద మాధవి నరసింహ, మాజీ ఎంపీటీసీ చినేటి సత్తయ్య, ఉప సర్పంచ్ శ్రీపతి సైదులు, మండల ప్రచార కార్యదర్శి భాషపాక రవి, గద్దపాటి సైదులు, గుత్తా కరుణాకర్‌రెడ్డి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

## మునుగోడులో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



చండూరు : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

**చండూరు :** రానున్న ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం చండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామానికి చెందిన పలువురు నాయకులు మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ నాయకుడు చనగాని వెంకన్న, యువజన విభాగం సభ్యుడు శివ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ సుజాఉద్దీన్, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ సరికొండ ముత్యాలు, బోడంగిపర్తి బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కట్కూరు సత్తయ్య, మాజీ ఎంపీటీసీ బొమ్మరగోని రామలింగయ్య, నిరంజన్, శ్రవణ్, రేవల్లి నరేష్, వట్టికోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి**

**మర్రిగూడ :** బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మర్రిగూడ మండలంలోని మేటిచందాపురం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఏరుకొండ అబ్బయ్య, బొల్లోజు శంకరాచారి మునుగోడులో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నామాపురం ఎంపీటీసీ ఊరిపక్క సరితనగేష్, ఏరుకొండ లింగస్వామి, శిలువేరు రమేష్, లపంగి భిక్షం, దొడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర



నల్లగొండ : బీట్ మార్కెట్ వద్ద అమ్మవారి శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు



నల్లగొండ : పద్మావతి నగర్‌లో దుర్గామాత శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు



నల్లగొండ : విద్యానగర్ కాలనీలో ..



నాంపల్లిలో..

### కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

**శాలిగౌరారం :** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు బుధవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శాలిగౌరారం సీఐ రాఘవరావు నేతృత్వంలో శాలిగౌరారం మండలంలోని వల్లాల, అడ్లూరు, శాలిగౌరారం, ఊట్కూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్, పెర్కకొండారం గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ సతీష్, సిబ్బంది, కేంద్ర బలాలకు చెందిన సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నారు.

### 'వాగ్దానాలు నమ్మి మోసపోవద్దు'

**శాలిగౌరారం :** ఎన్నికల్లో గెలుపు కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు పాలకవర్గాలు చేస్తున్న వాగ్దానాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఇందూరు సాగర్ అన్నారు. శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది సంవత్సరాల పాలనలో కేంద్రంలోని ప్రధాని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసానికి పాల్పడ్డాయన్నారు. దేశంలో నిరుద్యోగం, దారిద్ర్యం, ధరల పెరుగుదల, రైతుల ఆత్మహత్యలు, పెరిగిపోయాయన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి, ఉపాధ్యక్షుడు సిలివేరు జానయ్య, బండారు వెంకన్న, గుగ్గిళ్ళ రాములు, సిలివేరు అజిత్, నోముల రాజు, సందీప్, ప్రణయ్ పాల్గొన్నారు.